సాక్షి అనంతపురం

సోమవారం । 8 । సెప్టెంబర్ । 2025

భలే భలే జాబిలి..



ఆదివారం రాత్రి గ్రహణం ముందు చందమామ.. గ్రహణ సమయంలో వివిధ దశల్లో కనిపించిన జాబిలి..



చంద్రగ్రహణాన్ని వీక్షిస్తున్న అనంతవాసులు

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక



అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి. వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. అర్జీతో పాటు ఫోన్, ఆధార్ నంబర్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. కాల్ సెంటర్ 1100కు ఫోన్ చేసి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అర్జీలను 'పరిష్కార వేదిక'లోనే కాకుండా meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలియజేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

కసాపురం ఆలయం మూసివేత



ఆలయ తలుపులు మూసివేసిన దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానాన్ని ఆదివారం మూసివేశారు. రాత్రి 9.50 నుంచి 12.24 గంటల వరకూ సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకే ఆలయంలో మధ్యాహ్నిక, సాయంకాల ఆరాధనలు, హారతులు నిర్వహించిన అనంతరం ఆలయాన్ని మూసివేశారు. గ్రహణం అనంతరం సోమవారం వేకువజామున ఆలయ శుద్ధి, సంప్రోక్షణతో మూలవిరాట్‌కు నిత్యాభిషేకం నిర్వహించి ఉదయం 6 గంటల నుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు.

మౌనగిరి క్షేత్రంలో కర్ణాటక హైకోర్టు జడ్జి



భూమిపూజలో పాల్గొన్న న్యాయమూర్తి దేవదాస్ దంపతులు

రాప్తాడు: మండలంలోని హంపాపురం వద్ద 44వ జాతీయ రహదారి సమీపంలో ఉన్న మౌనగిరి క్షేత్రాన్ని జిల్లా అదనపు జడ్జి సత్యవాణితో కలసి ఆదివారం కర్ణాటక హైకోర్టు జడ్జి దేవదాస్ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి క్షేత్రం పీఠాధిపతి ఈశ్వరయ్యస్వామి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. క్షేత్రంలోని ఏకశిలా ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ సమీపంలో దక్షిణమూర్తి దేవాలయ నిర్మాణానికి న్యాయమూర్తి దంపతులు భూమిపూజ చేశారు.

కరుణ లేని సర్కారులో కన్నీళ్లే మిగిలాయి..



తన ఈడు స్నేహితురాళ్లతో సంతోషంగా ఆడుకోవాల్సిన వయసులో తీరని అన్యాయానికి గురైంది. మృగాళ్ల చేతికి చిక్కి విలవిలలాడిపోయింది. తల్లిదండ్రుల ప్రేమానురాగాలు పొందాల్సిన సమయంలో తనే ఓ బిడ్డకు తల్లయ్యింది. మేమున్నాం అంటూ ఆదుకోవాల్సిన వారు.. అలా చేస్తే ఎక్కడ తప్పు ఒప్పుకున్నట్లు అవుతుందోనని అసలు అటువైపే చూడలేదు. నాలుగు గోడలకే పరిమితం చేసేశారు. గుండెలవిసేలా రోదించినా స్పందన లేదు. అయిన వాళ్లు లేరు.. పలకరించే వారు కరువయ్యారు. ఏడ్చి ఏడ్చి కన్నీళ్లు కూడా కరువైపోయాయి. మౌన రోదనే మిగిలింది. చంద్రబాబు ప్రభుత్వ అలసత్వ ధోరణితో ఏడుగుర్రాలపల్లి దళిత బాలిక కుటుంబం వీధిన పడింది.

గతంలో సుగాలి ప్రీతి.. నేడు ఏడుగుర్రాలపల్లిలో యువతి

- దళిత మైనర్ బాలిక జీవితం అధోగతి
- ప్రసవమైన మూడు వారాలకే తల్లీబిడ్డను వేరుచేసిన అధికారులు
- ఎన్జీవో హోంలో బిక్కు బిక్కుమంటూ బతుకీడుస్తున్న బాలిక
- పసికందును ఎక్కడికి చేర్చారో ఇప్పటికీ తెలియని దుస్థితి
- బాధిత కుటుంబాన్ని పట్టించుకోని చంద్రబాబు ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గత టీడీపీ సర్కారు హయాంలో కర్నూలు జిల్లాలో సుగాలి ప్రీతిని కొందరు మృగాళ్లు అత్యాచారం చేసి హత్య చేశారు. ఆ పాపం ఇప్పటికీ చంద్రబాబు సర్కారును వెంటాడుతోంది. ఇంచుమించు అలాంటి ఘటనే మళ్లీ.. అదీ బాబు సీఎంగా ఉన్న సమయంలోనే శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లెలో జరిగింది. టీడీపీకి చెందిన మానవ మృగాలు ఓ దళిత బాలికను చెరపట్టి సామూహిక అత్యాచారం చేశాయి. దీంతో ఆ బాలిక గర్భం దాల్చి బిడ్డకు తల్లయింది. ఈ అమానుష ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మృగాళ్ల చేతిలో అన్యాయానికి గురైన బాలిక నేడు ఓ ఎన్జీవో హోంలో బాధను దిగమింగుకుని బిక్కుబిక్కుమంటూ బతుకీడుస్తోంది.

ఒంటరి బతుకు..

కొన్ని మాసాల క్రితం ఏడుగుర్రాలపల్లెలో దళిత మైనర్ బాలికపై అత్యాచారం చేశారు. ఈ విషయం బాహ్య ప్రపంచానికి తెలిసే సరికి ఆమె ఐదు మాసాల గర్భిణి. తర్వాత రెండు నెలలకు అనంతపురం సర్వజనాసుపత్రిలో ప్రసవం అయింది. అనంతరం మూడు వారాలకే తల్లి నుంచి బిడ్డను వేరు చేశారు. తల్లిని బత్తలపల్లిలోని ఆర్డీటీ హోంలో ఉంచారు. పసికందును ఎక్కడికి తీసుకెళ్లారో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. స్కూలుకెళ్లి ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన ఆ బాలిక ఇప్పుడు ఎన్జీవో హోంలో ఒంటరిగా జీవిస్తోంది. ఎక్కడికెళ్లాలో తెలియదు. ఏం చేయాలో తెలియదు. ఇక్కడ ఎన్నిరోజులు ఉంచుతారో తెలియదు. ఎప్పుడు బయటకు పంపిస్తారో తెలియదు.. ఇదీ ఆ బాలిక ఎదుర్కొంటున్న అగమ్యగోచర పరిస్థితి.

అప్పుడూ అంతే.. ఇప్పుడూ అంతే..

సామూహిక అత్యాచారంతో సర్వస్వం కోల్పోయిన దళిత మైనర్‌బాలికకు సర్కారు పైసా సాయం అందించలేదు. సాయం ప్రకటిస్తే నేరం ఒప్పుకున్నట్లు అవుతుందేమో అనుకున్న ప్రభుత్వం ఇప్పటికీ స్పందించలేదు. కనీసం రాప్తాడు ఎమ్మెల్యే కూడా పరామర్శించలేదు. ఆ బాలికకు సర్కారు సాయం లేక, కుటుంబంలో కూడా చూసుకునే వారు కరువై జీవితమే ఛిద్రమైంది. ఇప్పుడా బాలికను పోషిస్తారో లేదో కూడా అంతుచిక్కడం లేదు. స్వగ్రామానికి వెళ్లినా బతకనిస్తారా అన్నది అనుమానంగా ఉందని జిల్లా వాసుల్లో చర్చ జరుగుతోంది. కర్నూలు జిల్లాలో సుగాలి ప్రీతి తరహాలోనే ఈ బాధితురాలికి టీడీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రోజుకు కూడా బాలికను పరామర్శించడానికి గాని, బిడ్డను చూడటానికి గాని ఎవరికీ ప్రవేశం లేకుండా అధికారులు నిషేధం విధించారు. నెలరోజులుగా తల్లీ బిడ్డ ఎలా ఉన్నారు.. వారి బాగోగులు ఏమిటి అన్న వివరాలు ఎవరికీ తెలియడం లేదు. ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు గొంతెత్తితే అడ్డుకోవడం లేదా అరెస్టులు చేస్తున్నారు. గతంలో సుగాలి ప్రీతి హత్యాచారం కేసులో చేసిన పాపాన్ని నేడు ఏడుగుర్రాలపల్లిలో అత్యాచారం ఘటన విషయంలోనూ కొనసాగిస్తున్న సీఎం చంద్రబాబు తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

యూరియా సరఫరాపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్



గోడౌన్‌లో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వి.వినోద్ కుమార్

రాప్తాడు: యూరియా సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. ఆదివారం ఆయన రాప్తాడు మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ అయ్యవారిపల్లి రోడ్‌లో ఉన్న మార్క్‌ఫెడ్ గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంత వరకు ఎంత యూరియా వచ్చింది.. రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లకు ఎంత పంపించారు తదితర వివరాలను గోడౌన్ సిబ్బందితో ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎంఏఐడీ యాప్ ద్వారా యూరియా సరఫరా సజావుగా చేపట్టాలన్నారు. యూరియా కొనుగోలులో సమస్యలు ఉన్నట్లయితే కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. గోడౌన్‌కు ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రెండు వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, మరో 500 మెట్రిక్ టన్నులు వస్తోందన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, గోడౌన్ మేనేజర్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల విషయంపై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ

అనంతపురం అర్బన్: ఎరువులకు సంబంధించి ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎరువుల కొరత, అధిక ధరలకు విక్రయం, అక్రమ రవాణా, పంపిణీలో అవకతవకలు తదితర ఫిర్యాదులను కమాండ్ కంట్రోల్ రూమ్ 85002 92992 నంబరుకు ఫోన్ చేసి తెలపాలని కలెక్టర్ సూచించారు.

● ఇసుకాసురుల పాపం.. ఇదే సాక్ష్యం



కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుకాసురులకు హద్దే లేకుండా పోయింది. కాసుల కక్కుర్తితో యథేచ్ఛగా ఇసుకను కొల్లగొడుతున్నారు. వారు చేస్తున్న పాపాలు సామాన్యులకు శాపాలుగా మారాయి.అందుకు ప్రత్యక్ష సాక్ష్యమే ఈచిత్రం. బొమ్మనహాళ్ మండలం కల్లుదేవనహళ్లి వద్ద హగరి నదిలో గతంలో చేతి పంపు ఏర్పాటు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి హగరి నదిలో ఇసుక కొల్లగొట్టడం ప్రారంభించిన 'పచ్చ' నేతలు.. నదిలోని చేతి పంపు చుట్టూ ఇసుక తోడేసి గుంతలు మిగిల్చారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వేదావతి హగరి పొంగి ప్రవహించడంతో చేతి పంపు చుట్టూ ఉన్న కొద్దిపాటి ఇసుక కూడా కొట్టుకుపోయింది. దీంతో ప్రస్తుతం అందనంత ఎత్తుకు చేతి పంపు చేరింది. ఒకప్పుడు సులువుగా నీటిని పట్టుకున్న స్థానికులు నేడు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. కల్లుదేవనహళ్లిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ శీనానాయక్ దృష్టికి తీసుకెళ్లగా,పరిశీలించి చర్యలు చేపడతామని ఆయన చెప్పారు.

– బొమ్మనహాళ్:

హంద్రీ–నీవాలో తెలంగాణ వాసి గల్లంతు

వజ్రకరూరు: మండల పరిధిలోని హంద్రీ–నీవా కాలువలో తెలంగాణకు చెందిన ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తెలంగాణలోని నల్గొండ జిల్లా కందుకూరు మండలం శాంతిగూడెం గ్రామానికి చెందిన నాగిరెడ్డి (27) బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మహాలయ పౌర్ణమిని పురస్కరించుకుని బెంగళూరు నుంచి తన స్నేహితులతో కలసి వజ్రకరూరు మండలం పీసీ.ప్యాపిలికి ఆదివారం వచ్చాడు. ఈ క్రమంలో పీసీ ప్యాపిలి వద్ద ఉన్న హంద్రీ–నీవా ప్రధాన కాలువ వద్దకు స్నానం చేసేందుకు వెళ్లిన నాగిరెడ్డి... ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి గల్లంతయ్యాడు. కళ్ల ఎదుటే నీటిలో కొట్టుకుపోతున్న నాగిరెడ్డిని కాపాడేందుకు స్నేహితులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. నాగిరెడ్డి స్నేహితుడు రాజశేఖర్ సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు.

అస్పష్టత.. అయోమయం

- డీఎస్సీ–25 సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియలో పొరబాట్లు
- తల పట్టుకుంటున్న అధికారులు
- అన్ని సబ్జెక్టులను కలపడంతోనే దుస్థితి



ఇటీవల జరిగిన కౌన్సెలింగ్‌కు హాజరైన డీఎస్సీ మెరిట్ అభ్యర్థులు (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ–25పై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు అటు అభ్యర్థులు, ఇటు వెరిఫికేషన్ అధికారులను తీవ్ర గందరగోళానికి గురి చేస్తున్నాయి. గతంలో డీఎస్సీ నిర్వహణలో మెరిట్ జాబితాలు ప్రకటించగానే సబ్జెక్టుల వారీగా నిపుణులను ఏర్పాటు చేసుకుని సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ చేపట్టేవారు. కేటాయించిన సబ్జెక్టులో మెరిట్ సమస్య ఉత్పన్నమైనా ఎక్కడ పొరబాటు జరిగిందో ఇట్టే తెలిసిపోయేది. వెంటనే సరిదిద్దేవారు. తర్వాత ఎంపిక జాబితాను ప్రకటించేవారు. అయితే కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అభ్యర్థులను పక్కన పెడితే సంబంధిత అధికారులకే స్పష్టత లేక తలలు పట్టుకుంటున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయినా రీవెరిఫికేషన్, క్రాస్ వెరిఫికేషన్ దుస్థితి తలెత్తుతుండడంతో టెన్షన్ పడుతున్నారు. జిల్లాలో మొత్తం 807 వివిధ కేటగిరీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. మెరిట్ జాబితా విడుదల చేసినా ఏ పోస్టులో ఏయే కేటగిరీ అభ్యర్థులకు ఎక్కడ మొదలై, ఎక్కడ కటాఫ్ అవుతుందనే వివరాలు లేవు. నేరుగా అభ్యర్థుల మొబైళ్లకు కాల్ లెటర్లు పంపి ఆ జాబితా మాత్రమే విద్యాశాఖ అధికారులకు పంపారు. తమకంటే తక్కువ మార్కులు వచ్చిన వారికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచారంటూ చాలామంది అభ్యర్థులు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. వాస్తవానికి తక్కువ మార్కులు వచ్చిన వారు ఏదో ఒక రిజర్వేషన్ కేటగిరీ కింద వచ్చి ఉంటారు. పూర్తిస్థాయి జాబితా అధికారుల వద్ద లేకపోవడంతో దీనిపై స్పష్టత ఇవ్వలేక వారు అయోమయానికి గురవుతున్నారు.

ఒత్తిడిలో తప్పులు..

జిల్లాలో సర్టిఫికెట్ల పరిశీలనకు మొత్తం 16 టీంలు ఏర్పాటు చేశారు. ఒక టీంకు ఒక సబ్జెక్టు అభ్యర్థులను కేటాయించి ఉంటే ఆ సబ్జెక్టుకు ఏయే సర్టిఫికెట్లు ఉండాలనేది ఒకటికి రెండుసార్లు పరిశీలించి అన్నీ కరెక్టుగా ఉన్నాయా...లేదా అని చూసేందుకు సులువుగా ఉండేది. ఎస్జీటీ, ఎస్జీటీ కన్నడ, ఉర్దూ, స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టులు, టీజీపీ, పీజీటీ అన్ని సబ్జెక్టులు, ప్రిన్సిపాల్స్, పీడీ, పీఈటీ ఇలా మొత్తం 16–20 సబ్జెక్టుల అభ్యర్థులను ప్రతిటీంకూ కేటాయించడం సమస్యగా మారింది. ఒక్కో టీం అన్ని సబ్జెక్టులకు సంబంధించి 50 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆయా బృందాల అధికారులు తికమకపడ్డారు. ఈ గందరగోళ పరిస్థితుల్లోనే చిన్న పొరబాటు జరిగినా అర్హుడు అనర్హత జాబితాలోకి, అనర్హుడు అర్హత జాబితాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఒత్తిడిలో కొన్ని తప్పులు జరిగాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు డిగ్రీలో 50 శాతం మార్కులు ఉండాలి. 2017కు ముందు ఉత్తీర్ణత సాధించిన వారికి ఈ నిబంధన వర్తించదు. 2011లో 48 శాతంతో డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థిని పొరబాటున అనర్హత జాబితాలోకి చేర్చారు. మళ్లీ సరిదిద్దారు. ఇలా రీవెరిఫికేషన్, క్రాస్ వెరిఫికేషన్ సమయంలో 10 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల నమోదులో జరిగిన పొరబాట్లను గుర్తించారు. ఈ క్రమంలో సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న ప్రతిసారీ పొరపాట్లు బయటపడుతుండడం అధికారులను కలవరపెడుతోంది.

'ప్రిఫరెన్స్'తోనే తంటా..

దరఖాస్తు సమయంలోనే అభ్యర్థుల నుంచి 'ప్రిఫరెన్స్' తీసుకోవడంతో సమస్య నెలకొంది. ఎస్జీటీ, ఎస్ఏ, టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాల్ ఇలా చాలా మంది అభ్యర్థులు 2,3,4 పోస్టులకు ఎంపికయ్యారు. అవగాహన లేక పోస్టుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఎస్జీటీ పోస్టుకు తొలి ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పుడు అదే వారిపాలిట శాపంగా మారింది. ఇదే పోస్టు తీసుకోవాల్సిందేనని అధికారులు స్పష్టం చేయడంతో కొందరు అభ్యర్థులు తెలివిగా సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో ఎస్జీటీ సర్టిఫికెట్లు లేవని చెప్పారు. ఎస్జీటీ సర్టిఫికెట్లు లేకుంటే తర్వాత (ఎస్ఏ, పీజీటీ, టీజీటీ) పోస్టు ఇస్తారు. ఎన్ని పోస్టులకు ఎంపికై ఉంటే అన్ని పోస్టుల సర్టిఫికెట్లు జత చేస్తేనే అర్హుల జాబితాలో చేర్చాలని, లేదంటే అనర్హులుగా పరిగణించాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఆయా అభ్యర్థుల వెంట పడి మరీ సర్టిఫికెట్లను తెప్పించుకుని రీ వెరిఫికేషన్ చేశారు.

అది హిట్ కాదు.. సూపర్ చీట్ సభ

- చంద్రబాబు 14 నెలల్లో జిల్లాకు వెలగబెట్టింది శూన్యం
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఫైర్



అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, పార్టీ నేతలు

రాప్తాడురూరల్: 'చంద్రబాబు ఎన్నికల ముందు 200కు పైగా హామీలు ఇచ్చారు. సూపర్ సిక్స్‌లో రెండు పథకాలు అరకొరగా అమలు చేయగానే 'సూపర్ సిక్స్–సూపర్ హిట్' అంటున్నారు. అది సూపర్ హిట్ కాదు సూపర్ చీట్ సభ' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న తలపెట్టిన 'అన్నదాత పోరు'కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలకు రూ. 10 లక్షల కోట్లు అవసరం అవుతాయని, ఇప్పటిదాకా కనీసం రూ. 50 వేల కోట్ల పథకాలు కూడా ఇవ్వలేదన్నారు. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, లేదంటే ప్రతినెలా రూ. 2 వేలు భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా మోసం చేశారన్నారు. జిల్లాలో ఉపాధి లేక వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ఇస్తున్న పథకాలేవీ ఆపను... వాటితో పాటు అదనంగా ఇస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు 'చేయూత, ఆసరా, నేతన్న నేస్తం' అందించలేదన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ గురించి దుష్ప్రచారం చేసి అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని చెప్పి ఈరోజు ఎలా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు యూరియా కొరత కనిపించలేదా.. బ్లాక్‌మార్కెట్‌కు తరలించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

14 నెలల్లో ఏం వెలగబెట్టారు?

ఈ 14 నెలల్లో జిల్లాకు చంద్రబాబు ఏం వెలగబెట్టారని ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు జగన్‌ను తిడుతూ లోకేష్ వద్ద మెప్పు పొందాలని చూస్తున్నారన్నారు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇస్తామని చెప్పి ఒక్క ఇల్లయినా ఇచ్చారా అని దుయ్యబట్టారు.గత ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చి ఏడింటి నిర్మాణాలు కూడా పూర్తి చేశారన్నారు. నేడు చంద్రబాబు వాటిని సంపూర్ణంగా ప్రైవేట్ పరం చేశారని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి ఆర్నెల్లలో ప్రజలకు రూ. 16 వేల కోట్ల వాతలు పెట్టారన్నారు. గ్రేటర్ రాయలసీమ పరిధిలో రూ. 40 వేల కోట్లు ఖర్చు చేస్తే సంపూర్ణంగా నీటి ప్రాజెక్టులు పూర్తవుతాయని, అలాంటి వాటిని పక్కన పెట్టేసి అమరావతికి మాత్రమే పరిమితమయ్యారని మండిపడ్డారు. వెలిగొండ ప్రాజెక్ట్ గురించి పట్టించుకోలేదన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు అనుమతులు తీసుకురావడంపై ఎందుకు చిత్తశుద్ధి చూపించడం లేదని విమర్శించారు. హంద్రీ–నీవా వెడల్పులో భాగంగా గత ప్రభుత్వం 6,300 క్యూసెక్కులకు అనుమతులిచ్చి పనులు ప్రారంభిస్తే దానిని 3,800 క్యూసెక్కులకు కుదించడం వంచన కాదా అన్నారు. కేవలం చిత్తూరు జిల్లాకు నీటిని తీసుకెళ్లేందుకు యుద్ధప్రాతిపదికన లైనింగ్ పనులను పూర్తి చేయడం జిల్లా రైతులను మోసం చేయడం కాదా అని నిలదీశారు. అన్ని వర్గాలనూ మోసగించిన చంద్రబాబుకు 'అనంత'కు రావడానికి అర్హత ఉందా అని ప్రశ్నించారు. పయ్యావుల కేశవ్ ఫెయిల్యూర్ మినిస్టర్ అని, మరో మంత్రి సవితమ్మకు పులివెందుల వెళ్లి దొంగ ఓట్లు వేయించే శ్రద్ధ జిల్లా ప్రజల పట్ల లేదని విమర్శించారు. మంత్రి సత్యకుమార్ ఢిల్లీలో ఉంటారో, లక్నోలో ఉంటారో, బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఉంటారో ఎవరికీ తెలీదన్నారు.

ఆ ఎమ్మెల్యేలు అన్నమే తింటున్నారా?

అనంతపురం, రాప్తాడు ఎమ్మెల్యేలు కనీసం కడుపునకు అన్నం తింటున్నారా అని మండిపడ్డారు. వారి నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఇళ్ల నిర్మాణాలను 14 నెలలుగా విజిలెన్స్ తనిఖీల పేరుతో నిలబెట్టారని, ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదని అడ్వకేట్ జనరల్ స్పష్టం చేశారంటే ఆ ఇద్దరికీ సిగ్గుందా అని దుయ్యబట్టారు. అసమర్థ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ధనాపేక్ష కోసం పేదల ఇళ్ల నిర్మాణాలు అటకెక్కించారని ధ్వజమెత్తారు. సమావేశంలో అనంతపురం రూరల్ జెడ్పీటీసీ చంద్రకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు రంగంపేట గోపాల్‌రెడ్డి, బండి పవన్, లింగారెడ్డి, లోకనాథరెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమెరికాలో సాయి సాకేత్ సత్తా


సాయిసాకేత్

గుంతకల్లు: అమెరికాలో గుంతకల్లుకు చెందిన ఎన్‌ఆర్‌ఐ రమేష్, వాసవి దంపతుల కుమారుడు సాయిసాకేత్ రాణిస్తూ పలువురు ప్రశంసలు అందుకుంటున్నాడు. స్థానిక ఆంథోని స్ట్రీట్‌లోని రామస్వామి గుడి వద్ద నివాసముంటున్న స్టేట్ బ్యాంకు విశ్రాంత మేనేజర్ కె.శంకరనారాయణకు కుమారుడు రమేష్. వృత్తిరీత్యా 20 ఏళ్లుగా అమెరికాలోని కనెటికట్‌లో స్థిరపడ్డారు. రమేష్ కుమారుడు సాయిసాకేత్ ప్రస్తుతం అమెరికాలోనే బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో కళాశాలలో అప్టివర్ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాలో సాయిసాకేత్ ప్రతిభ చాటి ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యాడు. బీటెక్ కోర్సు పూర్తికాగానే ఏడాదికి రూ.5 కోట్లకు పైగా వేతనంతో ఉద్యోగ అవకాశం ఉన్నట్లుగా శంకరనారాయణగుప్తా తెలిపారు.

మామిడి చెట్ల నరికివేత

పెద్దవడుగూరు: మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన రైతు శేఖర్ తోటలోని ఆరు మామిడి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు.

భార్యను చంపిన భర్త


హతురాలు లక్ష్మీదేవి

చిలమత్తూరు: స్థానిక ఎస్సీ కాలనీలో దారుణం చోటు చేసుకొంది. ఓ వివాహితని ఆమె భర్త అతి కిరాతకంగా గొడ్డలితో నరికి హతమార్చాడు. స్థానికులు తెలిపిన మేరకు... చిలమత్తూరులోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న లక్ష్మీదేవి (35), రాఘవేంద్ర దంపతులకు ఇంటర్ చదువుతున్న కుమార్తె ఉంది. టీడీపీలో చురుకుగా వ్యవహరిస్తున్న రాఘవేంద్ర ఇటీవల తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న రాఘవేంద్ర కాసేపటి తర్వాత భార్యతో గొడవపడి గొడ్డలితో దాడికి తెగబడ్డాడు. రక్తం మడుగులో పడివున్న లక్ష్మీదేవిని స్థానికులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, భార్యను హతమార్చిన అనంతరం రాఘవేంద్ర నేరుగా పీఎస్‌కు చేరుకుని లొంగిపోయాడు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

రేషన్ మాఫియా అక్రమాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. చివరకు కార్డుదారులకు పంపిణీ చేయకముందే బియ్యాన్ని నల్లబజారుకు తరలించేస్తున్నారు. బియ్యం కావాలని ఎవరైనా అడిగితే.. వచ్చే నెలలో తీసుకోమని చెబుతున్నారు. జిల్లాలో కొందరు ప్రజాప్రతినిధులు, పోలీసుల కనుసన్నల్లోనే టీడీపీ నేతలు అక్రమ దందా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

- ప్రతి నెలా బ్లాక్ మార్కెట్‌కు టన్నుల కొద్దీ రేషన్ బియ్యం
- పేదల పొట్ట కొడుతున్న డీలర్లు
- కొందరు ప్రజాప్రతినిధులు, పోలీసుల కనుసన్నల్లోనే దందా


బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేసిన రేషన్‌బియ్యం

తాడిపత్రి టౌన్: జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. అక్రమార్జనకు అలవాటు పడిన కొందరు టీడీపీ నేతల మధ్య జరిగిన ఫోన్ సంభాషణ వైరల్ కావడం, అందులో అధికారులతో జరిగిన ఒప్పందాలపై ప్రస్తావించడం గతంలో రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఈ క్రమంలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. లబ్ధిదారులకు డీలర్లు నగదు అంటగడుతూ రేషన్ బియ్యాన్ని యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలించేస్తున్నారు. ఒక్క తాడిపత్రి నియోజకవర్గం నుంచే ప్రతి నెలా వందల టన్నుల రేషన్ బియ్యాన్ని మాఫియా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటోంది. అధికార పార్టీ అండతో పోలీసులను లోబర్చుకున్న కొందరు టీడీపీ నేతలు తాడిపత్రి నియోజకవర్గంలో రేషన్ మాఫియాకు తెరలేపారని ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. కేవలం 30 రోజుల వ్యవధిలోనే యాడికి, తాడిపత్రిలో వందల కొద్దీ టన్నుల రేషన్ బియ్యం నిల్వలను అధికారులు గుర్తించి, స్వాధీనం చేసుకోవడమే ఇందుకు నిదర్శనం.

ఆ రెండు మండలాల్లో అత్యధికం..

తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి, తాడిపత్రి మండలాల్లో టీడీపీ నాయకుల అండతో కొందరు డీలర్లు ఒకట్రెండు రోజులు మాత్రమే లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేసి, మిగిలిన వారి వేలి ముద్రలు తీసుకుని రేషన్ స్టాక్ లేదని చెబుతూ నగదు ముట్టజెబుతున్నారు. ఇంకొందరు డీలర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి వేలి ముద్రలు తీసుకుని నగదు అందజేస్తూ దందాకు తెరలేపారు. తాడిపత్రిలోని భగత్‌సింగ్ నగర్, నందలపాడు, గన్నెవారిపల్లి కాలనీ, రంగప్ప కాలనీ, శ్రీనివాసపురం, జయనగర్ కాలనీ, తాడిపత్రి మండలంలోని చిన్నపొలమడ, యాడికి, రాయలచెరువు ప్రాంతాల్లో మాఫియాను తలదన్నేలా రేషన్ దందా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా 150 టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని పదుల సంఖ్యలో లారీలు, ఐచర్లలో పొరుగు రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తాడిపత్రి మండలం పెద్ద పొలమడ వద్ద ఉన్న గోదాము నుంచే నేరుగా బ్లాక్ మార్కెట్‌కు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి.

రేషన్ బియ్యం పట్టివేత

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు క్రాస్ వద్ద ఆదివారం ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. ఇద్దరిని అరెస్ట్ చేసి, ఆటోను సీజ్ చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఉరవకొండలోని స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి తెలిపారు.

అంతిమ విజయం న్యాయానిదే

- మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లు టౌన్: వైఎస్సార్‌సీపీ నేతలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై కూటమి సర్కారు ఎన్ని కుట్రలు చేసి అక్రమ కేసులు బనాయించినా అంతిమ విజయం న్యాయానిదే అవుతుందని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మద్యం అక్రమ కేసులో విశ్రాంత అధికారులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్పకు ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసినా... వారిని జైలు నుంచి విడుదల చేయకుండా అడ్డుకుంటున్న జైలు అధికారుల తీరుపై మండిపడ్డారు. గౌరవ న్యాయస్థానాల ఉత్తర్వులను అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుందన్నారు. గతంలో తాడిపత్రికి వెళ్లడానికి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి అనుమతిస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చినా సంబంధిత అధికారులు బేఖాతరు చేశారన్నారు. కక్ష సాధింపు రాజకీయాలకు చంద్రబాబు ఇకనైనా స్వస్తి పలకాలని హితవు పలికారు. రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న దుర్మార్గమైన పరిస్థితులపై ప్రధాని మోదీ జోక్యం చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, మాజీ చైర్మన్ జింకల రామాంజి, కౌన్సిలర్లు నీలావతి, కుమారి, లింగన్న, సుమో బాషా, కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్ మాబు, నూర్‌నిజామి పాల్గొన్నారు.

వసూళ్లలో మార్కెట్ కమిటీల డీలా

- అనంతపురం, ఉరవకొండ మినహా మిగతావన్నీ వెనుకంజ



అనంతపురం అగ్రికల్చర్: వివిధ రకాల మార్కెట్ ఫీజు వసూళ్లలో జిల్లాలోని చాలా మార్కెట్ యార్డులు డీలా పడ్డాయి. అనంతపురం, ఉరవకొండ మార్కెట్ కమిటీలు మాత్రమే లక్ష్యసాధనలో ముందంజలో ఉండగా.. మిగిలిన ఏడు కమిటీలు వసూళ్లలో వెనుకబడ్డాయి. ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలో ఉన్న 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా రూ.13.49 కోట్లు రాబట్టాలని మార్కెటింగ్ శాఖ లక్ష్య నిర్దేశన చేసింది. ఆగస్టు నెలాఖరుతో ముగిసిన ఐదు నెలల కాలంలో రూ.4.68 కోట్లు వసూలైంది. అనంతపురం టార్గెట్ రూ.5.10 కోట్లు కాగా ఇప్పటికే 45.60 శాతంతో రూ.2.32 కోట్లు సాధించారు. అలాగే ఉరవకొండ టార్గెట్ రూ.90 లక్షలు కాగా 57.84 శాతంతో రూ.52 లక్షలు వసూలు చేసి అగ్రస్థానంలో కొనసాగుతోంది. గుత్తి మార్కెట్ కమిటీ కేవలం 13 శాతం వసూళ్లతో అట్టడుగున కొనసాగుతోంది. ఆ తర్వాత స్థానాల్లో రాప్తాడు 17 శాతం, గుంతకల్లు 20 శాతం, కళ్యాణదుర్గం 21 శాతంతో లక్ష్యానికి అందనంత దూరంలో పయనిస్తున్నాయి. రాయదుర్గం 24 శాతం, తాడిపత్రి 26 శాతం, శింగనమల 32 శాతంతో కాస్త ఫరవాలేదన్నట్లుగా ఉన్నాయి. గత నాలుగేళ్లుగా అనంతపురంతో పోటీ పడి అగ్రస్థానం సాధిస్తూ వస్తున్న శింగనమల మార్కెట్ కమిటీలో వసూళ్లు దారుణంగా పడిపోవడం విశేషం.

వీర విజృంభణ

- 40 బంతుల్లో 107 పరుగులు


ఫైన్ లెగ్ మీదుగా బంతిని బౌండరీకి తరలిస్తున్న కోగటం హనీష్ వీరారెడ్డి

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్–19 ఇన్విటేషన్ టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో కోగటం హనీష్ వీరారెడ్డి దూకుడు ప్రదర్శించాడు. కేవలం 40 బంతుల్లో 107 పరుగులు సాధించి ఫాస్టెస్ట్ సెంచరీతో రికార్డు నెలకొల్పాడు. వివరాలు.. ఆర్డీటీ క్రికెట్ స్టేడియం వేదికగా ఆదివారం ఆంధ్రా ప్రెసిడెంట్, ఆంధ్రా సెక్రటరీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి సెక్రటరీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 48.5 ఓవర్ల వద్ద 167 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో అర్దిత్ రెడ్డి 37 పరుగులు, జి.మన్విత్ రెడ్డి 31 పరుగులు చేశారు. ప్రెసిడెంట్ జట్టు బౌలర్ షాహుల్ హమీద్ ఐదు వికెట్లు తీసి సెక్రెటరీ జట్టును తక్కువ స్కోరుకే కట్టడి చేశాడు. అనంతరం బ్యాటింగ్ బరిలో దిగిన ఆంధ్రా ప్రెసిడెంట్ జట్టు కేవలం 27.1 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 170 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. బ్యాటర్ కోగటం హనీష్ వీరారెడ్డి 40 బంతుల్లో 13 ఫోర్లు, 8 సిక్సర్లతో 107 పరుగులు సాధించాడు. మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టు విజయానికి బాటలు వేశాడు.

మధ్యప్రదేశ్ వరుస విజయాలు..

మధ్యప్రదేశ్ జట్టు వరుసగా మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. మధ్యప్రదేశ్, బరోడా జట్ల మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ జట్టు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. 48.1 ఓవర్ల వద్ద 218 పరుగులకు ఆలౌట్ అఇంది. యశ్వర్దన్ సింగ్ 128 బంతుల్లో 106 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన బరోడా జట్టు 38.1 ఓవర్లలో 130 పరుగులకు ఆలౌట్ అయింది. 88 పరుగుల తేడాతో మధ్యప్రదేశ్ జట్టు గెలుపొందింది.

గుత్తిలో చోరీ

గుత్తి: స్థానిక జంగాల కాలనీలో నివాసముంటున్న తాటికొండ రమణ ఇంట్లో చోరీ జరిగింది. శనివారం అర్ధరాత్రి తర్వాత ఇంట్లోకి దుండగులు చొరబడి బీరువాలోఉంచిన రూ. 2.20 లక్షల నగదు, 8 తులాల బంగారు, 45 తులాల వెండి ఆభరణాలు అపహరించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి నిందితుల వేలి ముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

రాప్తాడు: స్థానిక పండమేరు వంకలోకి ఈతకు వెళ్లిన యువకుడు నీట మునిగి మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని పండమేరు వంకపై అయ్యవారిపల్లి చెక్ డ్యాం వద్ద ఆదివారం ఈత కొట్టేందుకు స్నేహితులతో కలసి రాప్తాడుకు చెందిన తలారి గిరీష్‌కుమార్ (27) వెళ్లాడు. లోతైన ప్రాంతానికి వెళ్లి తిరిగి రాలేక నీట మునిగాడు. స్నేహితులు గాలించినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టారు. సాయంత్రం 6 గంటల సమయంలో మృతదేహం బయటపడింది. ఘటనతో రాప్తాడులో విషాదఛాయలు అలుముకున్నాయి.

‘హంద్రీ-నీవా’లో తెలంగాణ వాసి గల్లంతు


నాగిరెడ్డి(ఫైల్)

వజ్రకరూరు: మండల పరిధిలోని హంద్రీ-నీవా కాలువలో తెలంగాణకు చెందిన ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తెలంగాణలోని నల్గొండ జిల్లా కందుకూరు మండలం శాంతిగూడెం గ్రామానికి చెందిన నాగిరెడ్డి బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మహాలయ పౌర్ణమిని పురస్కరించుకుని బెంగళూరు నుంచి తన స్నేహితులతో కలసి వజ్రకరూరు మండలం పీసీ.ప్యాపిలికి ఆదివారం వచ్చాడు. ఈ క్రమంలో పీసీ ప్యాపిలి వద్ద ఉన్న హంద్రీనీవా ప్రధాన కాలువ వద్దకు స్నానం చేసేందుకు వెళ్లిన నాగిరెడ్డి... ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి గల్లంతయ్యాడు. కళ్ల ఎదుటే నీటిలో కొట్టుకు పోతున్న నాగిరెడ్డిని కాపాడేందుకు స్నేహితులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. నాగిరెడ్డి స్నేహితుడు రాజశేఖర్ సమాచారంతో పోలీసులు రంగంలో దిగి గాలింపు చర్యలు చేపట్టారు.

బైక్ పై నుంచి కిందపడి వ్యక్తి మృతి

పరిగి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పరిగి మండలం గణపతిపల్లికి చెందిన వెంకటస్వామి (60)కి భార్య ముత్యాలమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యక్తిగత పనిపై ఆదివారం పైడేటి క్రాస్‌కు వచ్చిన వెంకటస్వామి పని ముగించుకుని సాయంత్రం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. స్వగ్రామానికి సమీపంలోకి చేరుకోగానే వాహనం అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో హిందూపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బసంపల్లిలో మృతదేహం ఖననానికి అడ్డంకులు


నారాయణ మృతదేహం వద్ద కూర్చొన్న కుటుంబ సభ్యులు, కాలనీవాసులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసంపల్లిలో మాల సామాజిక వర్గానికి చెందిన నారాయణ (85) ఆదివారం వేకువజామున మృతి చెందాడు. స్థల సమస్య కారణంగా ఖననానికి ఇబ్బందులు ఎదురుకావడంతో మృతదేహాన్ని ఇంటి వద్దే ఉంచుకోవడం కలకలం రేపింది. గ్రామంలో దళితుల శ్మశాన స్థల వివాదం కొన్నేళ్లుగా కొనసాగుతోంది. అదే గ్రామానికి చెందిన సత్యనారాయణ, ఆనంద్, ప్రకాష్‌తో పాటు దళిత వర్గీయుల మధ్య స్థల వివాదం ప్రస్తుతం కోర్టులో నడుస్తోంది. దీంతో దళితుల కుటుంబాల్లో ఎవరు మరణించినా వారి మృతదేహాన్ని ఖననం చేయాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం నారాయణ కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందిని తెలుసుకున్న తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎస్‌ఐ సత్యనారాయణ గ్రామానికి చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. ప్రస్తుతం శ్మశాన స్థల వివాదం కోర్టులో ఉందని, పరిష్కారం అయ్యే వరకూ మృతదేహాలను మరో చోట ఖననం చేయాలని సూచించారు. అయితే.. ఆనవాయితీ మేరకు అదే స్థలంలోనే ఖననం చేసేలా అనుమతులు ఇవ్వాలని అధికారులను దళితులు కోరారు.

ఆకాశంలో అందాల హరివిల్లు


మడకశిర మండలం జమ్మానిపల్లి వద్ద కనువిందు చేస్తున్న ఇంద్రధనుస్సు

మడకశిర రూరల్/కదిరి అర్బన్: ఆకాశంలో ఆదివారం సాయంత్రం అందాల హరివిల్లు కనువిందు చేసింది. సాయంత్రం చిరుజల్లులు కురుస్తుండగా కదిరిలోని టిడ్కో సముదాయాల వద్ద, మడకశిర మండలం జమ్మానిపల్లి వద్ద ఏర్పడిన ఇంద్ర ధనుస్సులను చూసి పలువురు ఆసక్తిగా గమనించారు. కాంతి పరావర్తనం కారణంగా ఒకదానిపై ఒకటి ఏర్పడిన ఇంద్రధనుస్సులను తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించేందుకు పోటీ పడ్డారు.

అరుదైన వ్యాధి.. అంతులేని వ్యథ

చూడడానికి బాగానే కనిపిస్తారు.. మంచంపై నుంచి కాలు కింద మోపలేరు.. చేతులు పైకెత్తలేరు.. దేనినీ పట్టుకోలేరు.. సొంత పనులూ చేసుకోలేరు.. ఏ తోడు లేకుండా ఒక్క ఇంచు కూడా కదల్లేరు.. ఒక్క మాటలో చెప్పాలంటే.. జీవశ్చవం. అరుదైన ఎంఎన్‌డీ వ్యాధితో మంచానికి పరిమితమైన గార్లదిన్నె మండలం పాతకల్లూరులోని నిరుపేద వివాహిత కన్నీటి గాథ ఇది.

- అరుదైన వ్యాధితో మంచాన పడిన వివాహిత
- దిక్కుతోచని స్థితిలో భర్త, పిల్లలు
- ఇప్పటికే బెంగళూరు, గోవాలో వైద్యానికి రూ.లక్షల ఖర్చు
- శస్త్రచికిత్సతో ఫలితముంటుందన్న నిపుణులు
- దాతల సాయం కోసం ఎదురు చూస్తున్న నిరుపేద కుటుంబం


నీళ్లు కూడా తాగలేని స్థితిలో ఉన్న నాగేంద్రమ్మ

గార్లదిన్నె: మండలంలోని పాతకల్లూరు ఎస్సీ కాలనీలో నివాసముంటున్న బాలయ్య, నాగేంద్రమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. మిగిలిన ఇద్దరు కుమార్తెలు ఇంటి వద్దేనే ఉంటున్నారు. నాలుగేళ్ల క్రితం నాగేంద్రమ్మ కాళ్లు చేతులు సచ్చు పడడంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. నయం కాకపోవడంతో బెంగళూరు, గోవా తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో వైద్యం చేయించారు.

కబళించిన అరుదైన వ్యాధి..

రూ.లక్షలు ఖర్చు పెడుతున్నా వ్యాధి నయం కాకపోవడంతో బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి నాగేంద్రమ్మను కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం అరుదైన మోటారు న్యూరాన్ వ్యాధి (ఎంఎన్‌డీ) బారిన పడినట్లుగా నిర్ధారించారు. నరాల బలహీనత వల్ల కాళ్లు, చేతులు సచ్చు పడిపోయాయని, శస్త్రచికిత్స చేస్తే నయమయ్యే అవకాశాలు ఉన్నాయని, ఇందుకు రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో నిరుపేద కుటుంబసభ్యుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటి వరకూ వైద్యానికి చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగింది. చేతిలో చిల్లిగవ్వ లేదు. రూ.4 వేల విలువైన మందులు కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తన తల్లికి శస్త్రచికిత్స చేయించి ప్రాణభిక్ష పెట్టాలని కుమార్తె శ్రీలక్ష్మి వేడుకుంటోంది.

అందని ప్రభుత్వ పింఛన్..

రెండున్నర సంవత్సరాలుగా మంచానికే పరిమితమైన నాగేంద్రమ్మకు పింఛన్ మంజూరు చేయడంలో నిబంధనలు అడ్డు వస్తున్నాయి. దివ్యాంగుల పింఛన్ రావాలంటే సదరం సర్టిఫికెట్ ఉండాలని అధికారులు అంటున్నారు. దీంతో సదరంలో స్లాట్ బుక్ చేసుకునేందుకు సచివాలయానికి వెళితే అప్పటికే గడువు ముగిసినట్లుగా అక్కడి సిబ్బంది తెలిపారు. ఇలా ఇప్పటి వరకూ ఐదారు సార్లు జరిగినట్లు కుటుంబసభ్యులు వాపోతున్నారు.

సాయం చేయదలిస్తే..

పేరు	: శ్రీలక్ష్మి (కుమార్తె)
బ్యాంకు	: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కల్లూరు, గార్లదిన్నె మండలం
బ్యాంకు ఖాతా	: 3354 766 8711
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్	: ఎస్‌బీఐఎన్ 0002737
ఫోన్ నంబర్	: 91006 46288

బొప్పాయి రైతులకు తిప్పలు

- మార్కెట్‌లో ధరలేక నష్టాలు
- చెట్లపైనే వదిలేసిన కాయలు


రాతిబావివంక సమీపంలో చెట్లపైనే వదిలేసిన బొప్పాయి కాయలు

గుమ్మఘట్ట: మార్కెట్‌లో ధరల్లేక బొప్పాయి సాగు చేసిన రైతులు నష్టపోతున్నారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని ఉద్యాన పంటలపై దృష్టి సారించిన రైతులు జిల్లా వ్యాప్తంగా 630 ఎకరాల్లో బొప్పాయి సాగు చేపట్టారు. ఉద్యానవఅధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ అధిక దిగుబడులూ సాధించారు. అయితే పంట చేతికి వచ్చే సరికి మార్కెట్‌లో ధరలు పతనమయ్యాయి. కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో తోటల్లో చెట్లపైనే కాయలను రైతులు వదిలేస్తున్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకున్న దళారులు కిలో రూ.7 చొప్పున కొనుగోలు చేస్తామంటూ వేదనను మిగిలిస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో బొప్పాయి సాగుకు రూ. లక్ష వరకు ఖర్చు పెట్టినట్లు రైతులు తెలిపారు.

ఈ పరిస్థితి వస్తుందనుకోలేదు



ఐదు ఎకరాల్లో బొప్పాయి సాగు చేశా. పెట్టుబడి కింద రూ. 5 లక్షల వరకు ఖర్చు పెట్టాను. దిగుబడి చేతికి వచ్చే సమయానికి ధరలు పూర్తిగా పడిపోయాయి. పంట కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇంతటి దుర్భర పరిస్థితి వస్తుందనుకోలేదు.

– ఆర్.టి.లక్ష్మీకాంతారెడ్డి, నేత్రపల్లి, గుమ్మఘట్ట మండలం

తీవ్రంగా నష్టపోయా



సాగు చేసిన బొప్పాయి పంట చేతికి వస్తుండగా చాలా సంబరపడ్డాను. అప్పులన్నీ తీరిపోతాయని అనుకున్నా. పంట కోతకు వచ్చిన తర్వాత కొనుగోలు చేయడానికి వ్యాపారులు రావడం లేదు. మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో తీవ్రంగా నష్ట పోయా. అప్పులకు వడ్డీల భారం పెరిగింది. ప్రభుత్వం స్పందించి పంట కొనుగోలు చేయాలి.

– గంగాధర, ఆవులదట్ల, గుమ్మఘట్ట మండలం

క్లుప్తంగా

వాల్మీకి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ధన



నియామకపత్రం అందుకుంటున్న ధన

రాప్తాడు: వాల్మీకి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాప్తాడుకు చెందిన ధనను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం ఆధ్వర్యంలో అనంతపురంలో వాల్మీకి సేవా సంఘం జిల్లా కార్యాలయంలో వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ధన మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వాల్మీకుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

యూరియా తక్కువ మోతాదులో వాడండి



యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏఓ కృష్ణ చైతన్య

రాప్తాడు: పంటలకు యూరియా తక్కువ మోతాదులో వాడుకోవాలని మండల వ్యవసాయాధికారి కృష్ణ చైతన్య రైతులకు సూచించారు. ఆదివారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని స్థానిక గ్రామ సచివాలయంలో యూరియా ఎరువు వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల వారీగా సిఫారసు చేసిన మేరకు మాత్రమే యూరియా వాడాలన్నారు. యూరియా, ఇతర ఎరువులు పొలంలో కలుపు తీసిన తర్వాత వేయాలని, లేకపోతే నత్రజని ఎక్కువ శాతం కలుపు మొక్కలు తీసుకుంటాయని వివరించారు. యూరియా తక్కువ మోతాదులో ఎక్కువ దఫాలుగా వాడుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో నేలలో యూరియా వేసే అవకాశం లేనప్పుడు 2 శాతం యూరియా ద్రావణం పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సుజిత, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జి సోనియా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'దళితులు చస్తే పూడ్చుకునేందుకు పోరాటాలు చేయాలా?'

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో దళితులు వివక్షకు గురవుతున్నారని ఎస్సీ,ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని బసంపల్లి గ్రామానికి చెందిన దళితుడు(మాల) నారాయణ అనే వృద్ధుడు మృతి చెందాడని, అదే గ్రామానికి చెందిన కొందరు శవాన్ని పూడ్చనీయకుండా అడ్డుకోవడం హేయమన్నారు. గ్రామంలో దళిత వర్గాలకు చెందిన వారు మరణిస్తే శవాన్ని పూడ్చడానికి కూడా పోరాడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని దళితులకు శ్మశాన స్థలాన్ని చూపాలని డిమాండ్ చేశారు.

ఘనంగా మహాలయ పౌర్ణమి పూజలు



ముక్తాపురంలో బోనాలు మోస్తున్న మహిళలు

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మహాలయ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనగానపల్లి, ముక్తాపురం, తగరకుంట గ్రామాల్లో ప్రజలు గ్రామలు సల్లాపురమ్మ, గంగమ్మ, మారెమ్మ దేవతలకు బోనాలు ఎత్తుకొని వెళ్లి పూజలు చేశారు. రైతులు తమ పంట పొలాల దగ్గరకు వెళ్లి పంటలు బాగా పండాలని పూజలు చేశారు.

పితృదేవతారాధనం అత్యంత పవిత్రం

అనంతపురం కల్చరల్: పితృదేవతారాధనం అత్యంత పవిత్రమని చిన్మయామిషన్ స్వామీజీ ఆత్మవిదానంద సరస్వతి అన్నారు. సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 20న మహాలయ పక్షాల సందర్భంగా సాగే ముక్తి హోమం, ముక్తి దీపం పోస్టర్లను స్వామీజీ ఆవిష్కరించారు. ఆదివారం సాయంత్రం తపోవనంలోని చిన్మయాజగదీశ్వరాలయంలో జరిగిన కార్యక్రమంలో స్వామీజీ మాట్లాడుతూ గతించిన పితృదేవతల రుణం తీర్చుకునే ముక్తి హోమం తొలిసారి సాయిట్రస్టు వారు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. మాసశివరాత్రి సందర్భంగా 20న స్థానిక మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో జర జరిగే హోమాది కార్యాక్రమంలో అందరూ పాల్గొని పితృదేవతారాధన చేయాలని సూచించారు. ట్రస్టు చైర్మన్ విజయ్ కుమార్, రాఘవేంద్ర, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కనెక్షన్.. కలెక్షన్

- నగరంలో అనధికారికంగా 7వేల కమర్షియల్ కనెక్షన్లు!
- రూ.లక్షల్లో నగరపాలక సంస్థ ఆదాయానికి గండి
- ఆన్‌లైన్‌లో నమోదు కాని కమర్షియల్ కనెక్షన్లు
- ఆన్‌లైన్ చేస్తే ఏటా రూ.కోట్లలో ఆదాయం



అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో గుట్టుచప్పుడు కాకుండా కమర్షియల్ నీటి కనెక్షన్ల దందా సాగుతోంది. పలువురు ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఫిట్టర్లు కుమ్మక్కై అనధికారికంగా ఉన్న కనెక్షన్ల నుంచి ఆరు నెలలకోసారి రూ.లక్షల్లో దోచుకుంటున్నట్లు తెలుస్తోంది. నగరంలోని అనధికార కమర్షియల్ నీటి కనెక్షన్లను గుర్తిస్తే నగరపాలక సంస్థకు రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుందని, తద్వారా నగరాభివృద్ధికి దోహదపడుతుందని నగరపాలక సంస్థ వర్గాలంటున్నాయి. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

7వేలకు పైమాటే:

నగరంలోని 50 డివిజన్లలోని 74 సచివాలయాల పరిధిలో హౌస్‌హోల్డ్స్ 70 వేలుండగా, అందులో 36,476 నీటి కనెక్షన్లు ఉన్నాయి. నగరంలో రోజూ 41.18 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ పర్ డే) నీటిని అందిస్తోంది నగరపాలక సంస్థ. నగరంలో 346.22 కిలోమీటర్ల మేర నీటి సరఫరా పైప్‌లైన్ ఉంది. కాగా వీటిలో కమర్షియల్ కనెక్షన్లు 560 మాత్రమే ఉన్నట్లు రికార్డుల్లో నమోదైంది. వాస్తవంగా నగరంలోని కమలానగర్, సుభాష్‌రోడ్డు, రాంనగర్, కోర్టు రోడ్డు, ఆర్ఎఫ్ రోడ్డు, హౌసింగ్ బోర్డు, సాయినగర్ 1,2,3,4,5,6,7,9 క్రాస్‌లు, విద్యుత్‌నగర్, తిలక్‌రోడ్డు, తదితర ప్రాంతాలు కమర్షియల్ జోన్లు. కాగా వీటితో పాటు 1,2,3,4,5 రోడ్లు, శ్రీనగర్ కాలనీ, మారుతీనగర్, అరవిందనగర్, కృపానంద నగర్, వేణుగోపాల్‌నగర్, రామచంద్రనగర్, రెవెన్యూ కాలనీ, అరుణోదయ కాలనీ, లెక్చరర్స్ కాలనీ, తదితర ప్రాంతాల్లో భారీగా అపార్ట్‌మెంట్లు వెలిశాయి. కానీ నగరపాలక సంస్థ రికార్డుల్లో మాత్రం కేవలం 560 మాత్రమే కమర్షియల్ కనెక్షన్లు ఉన్నట్లు పొందుపర్చారు. వీటి ద్వారా నగరపాలక సంస్థకు ఏటా రూ.98 లక్షలు డిమాండ్ రానుంది. దీంతో పాటుగా ఇప్పటి వరకు అరియర్స్ రూ.2.95 కోట్లు రావాల్సి ఉంది. వాస్తవంగా నగరపాలక సంస్థ పరిధిలో 7 వేలకు పైగా అనధికార కనెక్షన్లు ఉన్నట్లు సమాచారం.

రూ.లక్షల దోపిడీ

నగరపాలక సంస్థలోని పలువురు ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఫిట్టర్లు కుమ్మక్కై కమర్షియల్ నీటి కనెక్షన్ల నిర్వాహకుల నుంచి రూ.లక్షల్లో దోపిడీ చేస్తున్నట్లు సాక్షాత్తు నగరపాలక సంస్థలోని కొందరు సిబ్బంది బహిరంగంగా చెబుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు డోమెస్టిక్ కింద ఇచ్చిన కనెక్షన్లకు డబ్బు వసూలు చేస్తున్నారు కానీ అనధికార కనెక్షన్లపై ఏమాత్రమూ దృష్టి సారించడంలేదు. అందులోనూ ముఖ్యంగా కమర్షియల్ నీటి కనెక్షన్లకు సంబంధించి ఇంత వరకు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం గమనార్హం. నగరంలోని వివిధ ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది ద్వారా జల్లెడ పడితే 7వేలకుపైగా అనధికార కనెక్షన్లు వెలుగులోకి వస్తాయని కొందరు సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ఆ దిశగా దృష్టిసారిస్తారో లేదో వేచి చూడాలి.

నగరపాలక సంస్థ	
మొత్తం డివిజన్లు :	50
సచివాలయాలు :	74
నీటి కనెక్షన్లు :	36,476
కమర్షియల్ కనెక్షన్లు :	560
నగరానికి రోజూ అందించే నీరు :	41.18 ఎంఎల్‌డీ

క్రమబద్ధీకరణ చేసుకోవాలని చెప్పాం

కనెక్షన్ ఉండి డబ్బు చెల్లించకుండా ఉన్న వారెవరైనా ఉంటే తక్షణం ఆన్‌లైన్ చేసుకోవాలని చెప్పాం. లేకుంటే నీటి కనెక్షన్లను తొలగిస్తామని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం.

– రాజశేఖర్, నగరపాలక సంస్థ ఎస్ఈ

ఘనంగా సత్యసాయి గ్రామోత్సవం



ఊరేగింపులో పాల్గొన్న సత్యసాయిబాబా భక్తులు

చెన్నేకొత్తపల్లి: భగవాన్ పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పలువురు సత్యసాయి బాబా భక్తులు ఆదివారం చెన్నేకొత్తపల్లిలో భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు సత్యసాయిబాబా చిత్ర పటాన్ని ఊరేగించారు. సాయిబాబా పాదుకలు, స్వామి వారి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన సత్యసాయి బాబా భక్తులు చెన్నేకొత్తపల్లిలో భజనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా సాయి ట్రస్ట్ అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, మండల ఇన్‌చార్జ్ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో 'కూటమి' విఫలం



చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు

రామగిరి: ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు విమర్శించారు. ఆదివారం మండలంలోని పేరూరులో చంద్రబాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. బాబు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను మర్చిపోయారన్నారు. అమలు చేస్తున్న అరకొర వాటిలోనూ కోతలు విధిస్తూ లబ్ధిదారులను మోసం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అంటే మోసం గ్యారెంటీ అని ప్రజలందరికీ ఇప్పటికే అర్థమైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీటీసీ చిన్నముత్యాలు, నాయకులు కేసీ మల్లికార్జున, వెంకటరెడ్డి, గుడుసాల ఈశ్వరయ్య, పల్లి నారాయణ, వెంకటేశులుతో పాటు పంచాయతీలోని కొత్తపల్లి, దుబ్బార్లపల్లి, ఏడుగురాకులపల్లి గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సందడిగా రాష్ట్రస్థాయి నాటక పోటీలు



పాన్పుసీనులో నటిస్తున్న డీఆర్‌ఓ మలోల, అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి



భక్తప్రహ్లాద నాటకంలో దృశ్యం

- ఆకట్టుకున్న డీఆర్వో, అసిస్టెంట్ కమిషనర్ల ప్రదర్శన

అనంతపురం కల్చరల్: కృష్ణాకళామందిరం కళావేదిక పలు ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న రంగస్థల కళాకారులతో సందడిగా మారుతోంది. భగవాన్ సత్యసాయి నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న నాటక పోటీల్లో ఆదివారం కళ్యాణదుర్గం వారి 'మాయల మరాఠి', సాయంత్రం అనంతపురం వారి 'కార్యవర్ధి' సీను సమ్మోహనపరిచాయి. సురభి కళాకారుల 'భక్తప్రహ్లాద' నాటకం ఆకట్టుకుంది. నిజ జీవితంలో అన్నదమ్ములైన డీఆర్‌ఓ మలోల, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణార్జునులుగా నటించి మెప్పించారు. అర్జునుడిగా రాజగోపాల్, రుక్మిణిగా దేవి అద్భుతమైన పద్యాలతో ఆకట్టుకున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ వారి 'భక్త ప్రహ్లాద' పౌరాణిక పద్య నాటకం జరిగింది. నాటక సమాజ నిర్వాహకులు దివాకర్, మైఖేల్‌బాబు మాట్లాడుతూ మరో రెండు రోజుల పాటూ సాగే నాటకాలను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సువర్ణ, సీనియర్ రంగస్థల నటులు బండి నారాయణస్వామి, ఆదినారాయణరెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నాటక పోటీలు :

సోమవారం ఉదయం అనకాపల్లికి చెందిన కళాకారుల 'గయోపాఖ్యానం' పౌరాణిక పద్య నాటకం, తెలంగాణ సూర్యాపేట జిల్లా వారి 'భక్త చింతామణి' కామక్కపల్లి వారి 'శ్రీకృష్ణ తులాభారం' సాయంత్రం కణేకల్లు మండలం వారి 'సత్యహరిశ్చంద్ర' కాటి సీను, గుంటూరు జిల్లా వారి 'పల్నాడు యుద్ధం' నాటకాలు జరుగుతాయని నిర్వాహకులు వెల్లడించారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలు



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జున

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున అన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గత ఏడాది అతివృష్టి, అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇక ప్రభుత్వం విత్తనాలు, ఎరువులను సరైన సమయంలో సరఫరా చేయలేదన్నారు. గత ఏడాది కంటే ఎక్కువ యూరియా పంపించామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నదాంట్లో వాస్తవం లేదన్నారు. క్షేత్రస్థాయిలో యూరియా దొరక్క రైతులు బారులు తీరి గంటల తరబడి వేచి ఉన్నా అరకొర స్టాక్ ఉండడంతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలడమే ఇందుకు కారణమన్నారు. మంత్రులు, అధికారుల అండతో డిస్ట్రిబ్యూటర్లే యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా చర్యలు శూన్యమన్నారు. రూ.260కు అమ్మాల్సిన యూరియా రూ.350 నుంచి రూ.400కు అమ్ముతున్నారు. సమస్యలపై రైతులు, ప్రతిపక్షాలు మాట్లాడితే కావాలనే రాజకీయం చేస్తున్నారని చెప్పడం దారుణమన్నారు. తక్షణమే రైతులకు సరిపడా యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లావ్యాప్తంగా రెవెన్యూ డివిజన్, మండల కేంద్రాల్లో తలపెట్టిన ఆందోళనలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో భాద్రపద పౌర్ణమి వేడుకలు



మూడవరోడ్డులో సత్యదేవుని వ్రతం ఆచరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: విశేష పుణ్యఫలం ప్రాప్తిస్తుందని విశ్వసించే భాద్రపద పౌర్ణమి వేడుకలు ఆదివారం పలు ఆలయాల్లో ఘనంగా జరిగాయి. మొదటిరోడ్డులోని రాఘవేంద్రస్వామి మఠం, అశోక్‌నగర్‌లోని రమాసమేత సత్యనారాయణ స్వామి ఆలయం, మూడోరోడ్డు సత్యసాయి బాబా మందిరంలో సామూహిక వ్రతాలు జరిగాయి. శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలోని తపోవనంలోని శ్రీక్షేత్రంలో వివిధ దేవతామూర్తులకు అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించారు. హెచ్చెల్సీ కాలనీలో మంజునాథస్వామి ఆలయంలో బారులు తీరి భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలు చోట్ల మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది.

కనీస వేతనం అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి

అనంతపురం అర్బన్: ఏపీపీడీటీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జె.రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏపీపీటీడీ (ఆర్టీసీ) అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం సమావేశంలో రాజారెడ్డి మాట్లాడారు. ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ కార్మికులకు యాజమాన్యం నిర్ణయించిన మేరకు వేతనాలను కాంట్రాక్టర్లు ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్టర్ కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్ సక్రమంగా చెల్లించేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. ఏపీపీటీడీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రాజేష్‌గౌడ్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి నేరుగా ఆర్టీసీనే వేతనం ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఏపీపీటీడీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు ఓబుళరత్నం, అనంతపురం డిపో అధ్యక్షుడు ఎస్ఆర్‌ఖాన్, జిల్లా కార్యదర్శి ధర్మానాయక్, నాయకులు రామకృష్ణ, రసూల్, పవన్, పాల్గొన్నారు.

గ్రహణం రాకతో ఆలయాల మూసివేత





మూతపడిన హౌసింగ్ బోర్డులోని వెంకటరమణస్వామి ఆలయం, ఆర్టీసీ వేంకటేశ్వరాలయం

అనంతపురం కల్చరల్: గ్రహణం రాకతో ఆదివారం నగరంలోని ఆలయాలను మధ్యాహ్నం సమయంలోనే మూసివేశారు. చాలా దశాబ్దాల తర్వాత వచ్చిన రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం కావడంతో ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, రాఘవేంద్రస్వామి మఠం అర్చకులు మాట్లాడుతూ వాస్తవానికి చంద్రగ్రహణ ప్రభావం సూర్యాస్తమయం తర్వాతే ఉన్నప్పటికీ గ్రహణ నీడ భూమిపై స్పష్టంగా ఉంటుందని ఆలయ ద్వారాలు మూసివేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే పలుచోట్ల భక్తులకు ఆహార పానీయాల శుద్ధి కోసం గరిక అందించారు. హౌసింగుబోర్డు వేంకటేశ్వరాలయం వద్ద కమిటీ సభ్యులు చంద్రగ్రహణం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అన్ని జాగ్రత్తలు పాటించాలని ప్రతి రాశి వారు సోమవారం గ్రహదోష పూజలు చేయించుకుంటే మంచిదన్నారు. ఆలయంలో తెల్లవారు జామున నుంచే శుద్ధి పూజలు, గ్రహదోషనివారణ సమేత నవగ్రహపూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కళలతో మానసిక ప్రశాంతత



కళారాధకుడు మురుగన్‌ను సత్కరిస్తున్న గాయనీ గాయకులు

అనంతపురం కల్చరల్: ఒత్తిడి నిండిన జీవితాలకు సాంత్వన, మానసిక ప్రశాంతత కల్గించేవి కళలు మాత్రమేనని డీఆర్వో మలోల అన్నారు. విశిష్ట సేవా పురస్కారమందుకున్న జీవీరామయ్య, నిత్య కళలకు తోడ్పాటునందిస్తున్న పాలసముద్రం మురుగన్, శ్రీదేవి తదితరులను ఘంటసాల ఆరాధన సమితి, ఇతర కళా సంస్థలతో కలిసి ఘనంగా సత్కరించారు. ఆదివారం స్థానిక మూడోరోడ్డులోని ఘంటసాల భవన్ వేదికగా సాగిన ఆత్మీయ అభినందన సభకు డీఆర్వో, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి, సీనియర్ గాయకులు పాలసముద్రం నాగరాజు, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ సుధాకరబాబు హాజరై మాట్లాడారు. నిరంతరం కష్టించే శరీరం ఉల్లాసంగా ఉండాలంటే ఆనందంగా ఉండే మనసును సమన్వయం చేసుకోవాలని, ఆ పనిని చేస్తున్న ఘంటసాల ఆరాధన సమితి వారు అభినందనీయులన్నారు. అనంతరం పద్మజ, లక్ష్మీనారాయణ, మురళి, బృంద, శ్రీదేవి తదితరులు గానంతో అలరించారు. యోగా సుధాకరమూర్తి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేళాంగణి మాత గ్రామోత్సవం





ఆత్మకూరులో వేళాంగణి మాత స్వరూపాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: క్రైస్తవుల ఆరాధ్య దైవం వేళాంగణి మాత స్వరూపాన్ని ఆదివారం మండల కేంద్రంలో గ్రామోత్సవం నిర్వహించారు. మొదటగా వేళాంగణి మాత ఆలయం వద్ద నుంచి వేళాంగణి మాత స్వరూప విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. తిరిగి ఆలయం వద్ద యాలేరు విచారణ ఫాదర్ అమృతరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. వేళాంగణి మాత పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహిస్తామని, ఒక్కరోజు ముందు గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. మండలంలోని ఆత్మకూరు, కొత్తపల్లి, యాలేరు, నుసికొట్టాల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గుత్తి: పట్టణ శివారులో ఆదివారం ఓ లారీ డ్రైవర్ డ్రైవ్ చేస్తున్న సమయంలో ఉన్నఫళంగా తలనొప్పి రావడంతోపాటు కళ్లు తిరిగాయి. దీంతో డ్రైవింగ్ బ్యాలెన్స్ తప్పింది. అయితే డ్రైవర్ చాక చక్యంగా లారీని రోడ్డు పక్కకు తీసుకెళ్లి నిలిపి వేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. అనంతపురానికి చెందిన బాషా ఆదివారం కర్ణాటక నుంచి లారీలో జేసీబీని లోడ్ చేసుకుని సింహాద్రి పురానికి బయలుదేరాడు. అయితే గుత్తి సమీపంలోకి వచ్చాక విపరీతంగా తలనొప్పి, కళ్లు తిరిగాయి. దీంతో అతి కష్టం మీద లారీని రోడ్డు పక్కకు తీసుకెళ్లి ఆపాడు. స్థానికులు గమనించి లారీ డ్రైవర్ బాషాను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

శశి మాకులమ్మ ఆలయంలో చోరీ

కుందుర్పి: మండల పరిధిలోని కరిగానిపల్లి శివారులో ఉన్న శశి మాకులమ్మ ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దొంగలు ఆలయంలోకి ప్రవేశించి, 20 తులాల వెండి ఆభరణాలు, ఒకటిన్నర తులం బంగారు తాళి బొట్టు, రూ.6వేల నగదు ఎత్తుకెళ్లారు. దీనిపై పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాన్ని మూసివేస్తున్న ఆలయ సిబ్బంది



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామంలో వెలసిన సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి పంచామృతాభిషేకాలతో పాటు విశేష పూజలు నిర్వహించారు. ఆకుపూజ, అర్చన, మహానైవేద్యం, పల్లకీ సేవతో పాటు మహా మంగళహారతి కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలను నిర్వహించారు.

ఆలయం మూసివేత

ఆత్మకూరు: భాద్రపద మాస శుద్ధ పౌర్ణమి సందర్భంగా సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో మధ్యాహ్నం 1 గంట వరకూ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం మూసివేశారు. సోమవారం ఉదయం నుంచి పూజలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ బాబు తెలిపారు.